ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 16 మే 2024

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల


ఎచ్చెర్ల, మే 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థుల మొదటి సెమిస్టర్ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. బీఏ, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ హానర్స్‌తో పాటు బీకాం, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మొత్తం 8,299 మంది విద్యార్థులు సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 4,911 మంది(59.18 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల వివరాలను జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని వర్సిటీ పరీక్షల విభాగం డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. ఫలితాలపై ఏమైనా సందేహాలు ఉంటే నిర్దేశించిన రుసుం చెల్లించి 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎవరికి అనుకూలమో?

- జిల్లాలో గతం కంటే పెరిగిన పోలింగ్
- 2019లో 75.33 శాతం..
- ఇప్పుడు 76.81 శాతం నమోదు
- ఓటింగ్‌లో మహిళలే ముందంజ
- మాకే అనుకూలమంటున్న కూటమి

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసి మూడు రోజులు అయింది. అయినా పొలిటికల్ హీట్ తగ్గలేదు. 2019 ఎన్నికలతో పోల్చితే ఈ దఫా పోలింగ్ శాతం పెరిగింది. అప్పుడు అధికశాతం నియోజకవర్గాల్లో అభ్యర్థి ఎవరన్నదీ పరిగణనలోకి తీసుకోకుండా ఓటర్లు వైసీపీకి 'ఒక్క ఛాన్స్' ఇచ్చారు. ఇప్పుడా పరిస్థితిలేదు. ఈ ఎన్నికల్లో వైసీపీ సర్కారుకు చాలా వర్గాలు దూరమయ్యాయి. పైగా సొంతపార్టీలోనూ అసమ్మతి తీవ్రమైంది. ఎన్డీఏ కూటమి చెప్పుకుంటున్నట్లుగా విశ్లేషణను వైసీపీ జిల్లాలో చెప్పలేకపోతుంది. పైగా పోలింగ్ శాతం పెరగడంతో టీడీపీకి లాభం కూర్చేలా.. వైసీపీకి నష్టం తప్పదన్న సంకేతాలు స్పష్టమవుతున్నాయి. మరో 18 రోజుల్లో ఫలితాలు అధికారికంగా వెల్లడికానున్నాయి.



గత ఎన్నికల్లో 75.33 శాతం..

2019 ఎన్నికల్లో జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో 75.33 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో 76.81 శాతం నమోదైంది. ఎచ్చెర్ల అసెంబ్లీలో గత ఎన్నికల్లో 84.3 శాతం ఓటింగ్ జరగ్గా, ఈ దఫా 83.28శాతం పోలింగ్ నమోదైంది. పెద్దతేడా ఏమీలేదు. మిగిలిన ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం, శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాల్లో గతం కంటే పోలింగ్ శాతం పెరిగింది. ఇదంతా టీడీపీకి కలిసివచ్చే అవకాశముంది.

ఓటేసినవారు 14,40,885 మంది

ఈ ఎన్నికల్లో మొత్తం 14,40,885 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో మొత్తం 18,75,934 ఓటర్లు ఉండగా.. ఇందులో పురుష ఓటర్లు 9,29,859, మహిళా ఓటర్లు 9,45,945 మంది, ఇతరులు 130 మంది ఉన్నారు. వీరిలో ఓటు హక్కును వినియోగించుకున్న వారు పురుషులు 7,01,016 మంది, మహిళలు 7,39,852 మంది, ఇతరులు 17 మంది ఉన్నారు. అంటే 76.81 శాతం మంది ఓటుహక్కును సద్వినియోగించుకున్నారు. 2019లో జగన్‌పై ఉన్న సానుభూతి ఇప్పుడు లేకపోవడం.. కనీసం గ్రామాల్లో రోడ్లు కూడా బాగు చేయకపోవడం.. మంత్రులు, స్పీకర్ వంటి పదవులు జిల్లాకు లభించినా.. వారు కూడా ప్రతిపక్షాన్ని తూర్పారబట్టేందుకే తప్ప జిల్లాకు ఊడబొడిచిందేమీ లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. కూటమి అధికారంలోకి వస్తుందని, జిల్లాలో 8 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుంటామని ఎన్డీఏ అభ్యర్థులు వెల్లడిస్తున్నారు. శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం గురించి చర్చించుకోనవసరంలేదు. ఎంపీ అభ్యర్థి రామ్మోహన్‌నాయుడుకి లక్షా 60వేలు మెజార్టీ వస్తుందని అంచనాకు వచ్చేశారు. దీనిపై పందేలు జోరందుకున్నాయి.

గత ఎన్నికలు.. ఇప్పటి ఎన్నికల పోలింగ్ సరళి..

అసెంబ్లీ (నియోజకవర్గం)	2019లో పోలైన ఓట్లు (శాతం)			2024లో పోలైన ఓట్లు (శాతం)		
	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	మొత్తం ఓటర్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	మొత్తం ఓటర్లు
ఇచ్ఛాపురం	63.22	77.13	70.28	65.49	75.38	70.56
పలాస	68.45	78.18	73.35	73.10	79.61	76.42
టెక్కలి	76.23	81.26	78.71	79.33	81.70	80.51
పాతపట్టణం	68.24	72.24	70.23	71.63	73.10	72.36
శ్రీకాకుళం	68.7	71.29	69.99	69.55	70.89	70.22
ఆమదాలవలస	78.06	79.76	78.89	81.63	81.23	81.42
నరసన్నపేట	78.37	81.65	80	81.91	82.99	82.44
ఎచ్చెర్ల	83.44	85.2	84.3	83.44	83.12	83.28
మొత్తం	72.91	78.17	75.53	75.38	78.21	76.81

2024 ఎన్నికల్లో పోలైన ఓట్లు..

నియోజకవర్గం	జిల్లా ఓటర్లు				పోలైన ఓట్లు			
	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఇచ్ఛాపురం	1,30,751	1,37,434	17	2,68,202	85,632	1,03,604	2	1,89,238
పలాస	1,07,278	1,12,049	21	2,19,348	78,423	89,207	2	1,67,632
టెక్కలి	1,17,816	1,18,502	9	2,36,327	93,458	96,812	2	1,90,272
పాతపట్నం	1,12,367	1,12,936	10	2,25,313	80,485	82,556	3	1,63,044
శ్రీకాకుళం	1,35,301	1,37,928	31	2,73,260	94,098	97,776	1	1,91,875
ఆమదాలవలస	96,179	97,664	15	1,93,858	78,515	79,330	3	1,57,848
ఎచ్చెర్ల	1,23,064	1,21,682	14	2,44,760	1,02,681	1,01,147	3	2,03,831
నరసన్నపేట	1,07,103	1,07,750	13	2,14,866	87,724	89,420	1	17,7145
మొత్తం	9,29,859	9,45,945	130	18,75,934	7,01,016	7,39,852	17	14,40,885



వంశధార ఎస్ఈ తిరుమలరావు నుంచి వివరాలు తెలుసుకుంటన్న సీఈసీడీవో, ఇంజనీరింగ్ అధికారులు

గొట్టా బ్యారేజి రక్షణకు చర్యలు తీసుకుంటాం

- రూ.25 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు
- సీఈసీడీవో బీఎస్ఎస్ శ్రీనివాసయాదవ్

హిరమండలం, మే 15: హిరమండలం వద్ద వంశధార నదిపై ఉన్న గొట్టా బ్యారేజి సురక్షితంగా ఉన్నప్పటికీ దాని రక్షణకు తక్షణమే చర్యలు తీసుకోవాల్సి ఉందని సీఈ సీడీవో బీఎస్ఎస్ శ్రీనివాసయాదవ్ వంశధార అధికారులకు సూచించారు. బుధవారం గొట్టా బ్యారేజితో పాటు వంశధార రిజర్వాయర్, ఎత్తిపోతల పథకం పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొట్టా బ్యారేజి రక్షణకు తీసుకోవలసిన చర్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని చెప్పారు. ఈ మేరకు వివిధ హోదాల్లో ఉన్న ఇరిగేషన్ శాఖకు చెందిన ఇంజనీరింగ్ అధికారులతో బ్యారేజీని పరిశీలించినట్లు చెప్పారు. బ్యారేజి దిగువన ఉన్న జడ్జిస్టోన్ ఏప్రాన్, సీసీ బ్లాక్‌లు మరమ్మతులకు ప్రభుత్వం రూ.12.19 కోట్లు మంజూరు చేసిందని, అయితే పనులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం ఎస్టిమేషన్ కాస్ట్ పెరిగిందని చెప్పారు. ఈ నిధులతో 2015 డ్రాయింగ్ ప్రకారం మరమ్మతులు చేపట్టాల్సి ఉందన్నారు. పూర్తి స్థాయిలో అధ్యాయనం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిధులు (డ్రిప్ పథకం) ద్వారా బ్యారేజి పటిష్టతకు రూ.25 కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఈ నిధులు మంజూరైతే బ్యారేజి గేట్లు మరమ్మతులు, పెయింటింగ్స్, ఇతర పనులు చేపడతామని వివరించారు. ఆయనతో పాటు ఎస్ఈ సీడీవో జి.ఎస్.శివకుమార్, ఈఈలు సీడీవో ఎ.విజయభాస్కర్, కె.శేషుబాబు, డీఈఈలు సీడీవో కేదారేశ్వరరెడ్డి,కె.రీణా, జి.శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణ, వంశధార ప్రాజెక్టు ఎస్ఈ డోల తిరుమలరావు, ఈఈ ఎంవీ రమణ, డీఈఈలు రవికాంత్, సురేష్ ఉన్నారు.

కురిసింది వాన

- జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం

హిరమండలం/జి.సిగడాం/పాతపట్నం, మే15: జిల్లాలో పలుచోట్ల బుధవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం వరకూ ఎండ తీవ్రతతో ప్రజలు అల్లాడిపోయారు. ఆ తరువాత ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. హిరమండలం, జి.సిగడాం, పాతప ట్నం, తదితర మండలాల్లో భారీ వర్షం పడింది. గంటకుపైగా పడిన వర్షానికి వాతావరణ చల్లబడింది. ఈ వర్షం వేసవి దుక్కులకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



హిరమండలంలో కురుస్తున్న వర్షం

నేటి నుంచి ఏపీ ఈఏపీ సెట్

- జిల్లాలో 4 కేంద్రాలు ఏర్పాటు
- ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

ఎచ్చెర్ల, మే 15: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లకు సంబంధించి ప్రవేశ పరీక్ష ఏపీ ఈఏపీ సెట్-2024 గురువారం నుంచి ప్రారంభంకానుంది. ఈ నెల 23వ తేదీ వరకు జరిగే ఈ పరీక్ష కోసం జిల్లాలో శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం), వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల), ఐతం (టెక్కలి), కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట) కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం గంటల 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రతి రోజూ రెండు షిఫ్టుల్లో ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్ష నిర్వహిస్తారు. జేఎన్‌టీయూ (కాకినాడ) పర్యవేక్షణలో ఈ పరీక్ష జరగనుంది. నిర్దేశించిన సమయానికి రెండు గంటల ముందు నుంచి పరీక్ష కేంద్రంలోకి అభ్య ర్థులను అనుమతిస్తారు. పరీక్ష ప్రారంభ సమయానికి అభ్యర్థులు కచ్చి తంగా చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతించమని నిర్వాహ కులు వెల్లడించారు. హాల్‌టిక్కెట్, ఒరిజినల్ గుర్తింపు కార్డుతో హాజరు కావాలి. ఏ రకమైన ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు.

సినీ ఫక్కీలో చోరీ

- స్కూటీ డిక్కీలోని రూ.3.50 లక్షలు అపహరణ

ఇచ్ఛాపురం, మే 15: ఇచ్ఛాపురం పట్టణంలో బుధవారం సినీ ఫక్కీలో చోరీ జరిగింది. పట్టణంలోని దాసన్నపేటకు చెందిన బియ్యం వ్యాపారి సింగంశెట్టి శ్రీను బుధవారం మధ్యాహ్నం యూనియన్ బ్యాంక్‌లో రూ.3.50లక్షల నగదును డ్రా చేశాడు. ఆ నగదును తన స్కూటీ డిక్కీలో పెట్టి ఇంటికి బయలుదేరాడు. మార్కెట్ జంక్షన్ వద్ద స్కూటీని పక్కన పెట్టి నగదు దాచేందుకు అవసరమైన బ్యాగ్‌ను కొనుగోలు చేసేందుకు దుకాణానికి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి డిక్కీలోని నగదు మాయమయ్యింది. దీంతో వెంటనే బాధితుడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. సంఘటనా స్థలానికి పట్టణ ఎస్ఐ సత్యనారాయణ చేరుకుని స్థానికులను విచారించారు. పల్సర్ బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి స్కూటీ డిక్కీ తెరిచారని చెప్పడంతో పక్క షాపుల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు వచ్చినట్లు పుటేజీల్లో కనిపించింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



సంఘటనా స్థలంలో స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ

పాతాళానికి గంగమ్మ

- జిల్లాలో అడుగంటుతున్న భూగర్భ జలాలు
- 10 మండలాల్లో ప్రమాద ఘంటికలు
- 7.98 మీటర్ల లోతులో జలాలు
- వర్షాభావం, విచ్చలవిడిగా నీటి వినియోగమే కారణం
- పొదుపుగా వాడుకోవాలని అధికారుల సూచన



మెళియాపుట్టి మండలం చాపర గ్రామానికి చెందిన గండేటి చిన్నారావు గత పదేళ్ల నుంచి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. అయితే గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది ఇంటిలో ఉన్న బావి అడుగంటింది. దీంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాడు. గత్యంతరం లేక రూ.2వేలు చెల్లించి బయట నుంచి ట్యాంకర్‌తో నీటిని తీసుకుచ్చి బావిని నింపి వినియోగిస్తున్నాడు. చిన్నారావు చిరువ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నీటికి అదనపు ఖర్చు కావడంతో లబోదిబోమంటున్నాడు.

మెళియాపుట్టి, మే 15

జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. దీంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. గతేడాది తక్కువగా వర్షాలు కురవడంతో ఆ ప్రభావం భూగర్భ జలాలపై పడింది. నీటి వినియోగంపై నియంత్రణ లేకపోవడం, వాడిన నీటిని తిరిగి భూగర్భంలో ఇంకేటట్లు చేయకపోవడం, తదితర కారణాలతో రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. నీటి సంరక్షణకు ప్రజలు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దీనికి ప్రధాన కారణంగా జల నిపుణులు పేర్కొన్నారు. ఎండలకు తోడు తీవ్ర వర్షాభావంతో నదులు, చెరువులు ఎండిపోయాయి. బోర్లు అడుగంటిపోవడంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. నదుల్లో ఇసుకను పరిమితికి మించి తవ్వకాలు చేపడుతున్నారు. దీంతో నీటి చెమ్మ తగలడం లేదు. తాగునీటి సమస్యపై అదికారులు సైతం చేతులు ఎత్తేశారు.




మెళియాపుట్టి చాపరలో ట్యాంకర్ ద్వారా నీరు తెస్తున్న దృశ్యం

పది మండలాల్లో తగ్గుముఖం..

జిల్లాలో ఎచ్చెర్ల, సోంపేట, పలాస, కోటబొమ్మాళి, సారవకోట, రణస్థలం, లావేరు, మెళియాపుట్టి, పొందూరు, జి.సిగడాం మండలాల్లో అధికంగా భూగర్భ జలాలు తగ్గు ముఖం పట్టినట్లు సంబంధిత అధికారులు హెచ్చరించారు. రోజువారి అవసరాలకు సామాన్యులు, వాణిజ్య అవసరాలకు వ్యాపారులు భూగర్భ జలాలపై ఆధారపడుతున్నారు. దీనికోసం వందల మీటర్ల లోతుకు బోర్లు వేసి నీటిని తోడుతున్నారు. వాస్తవానికి 70 శాతం నీటిని వినియోగిస్తే నీటిమట్టం సురక్షితంగా ఉంటుంది. 70 నుంచి 90 శాతం నీటిని వినియోగించుకుంటే సెమీ క్రిటికల్, 90 నుంచి 100 శాతం వినియోగిస్తే క్రిటికల్, 100 శాతం కంటే ఎక్కువగా వినియోగిస్తే అత్యంత తీవ్ర స్థాయిగా గుర్తిస్తారు. జిల్లాలో సరాసరి నీటి వినియోగం కేవలం 33 శాతం అయినప్పటికీ రణస్థలం, లావేరు, మెళియాపుట్టి, పొందూరు, జి.సిగడాం మండలాల్లో మాత్రం పరిమితికి మించి 100 శాతం కంటే అధికంగా నీటిని వినియోగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం బోరు తీయాలంటే ముందుగా పంచాయతీ, రెవెన్యూ అధికారుల అనుమతులు తీసుకోవాలి. అయితే కొంతమంది అధికారులకు ఎంతోకొంత ముట్టజెప్పి ఎక్కడికక్కడే బోర్లు తీస్తుండడంతో ఇటువంటి పరిస్థితులు వస్తున్నాయి. అయితే ఇప్పటికే కొన్ని గ్రామాలను గుర్తించి డ్రిల్లింగ్ జరపకుండా చూడాలని భూగర్భ జలశాఖ అధికారులు పంచాయతీ అధికారులకు తెలియజేశారు. అయినా కొంతమంది రాజకీయ నాయకులు ఒత్తిడి మేరకు బోర్ల తవ్వకాలకు అనుమతులు ఇస్తున్నారు. జిల్లాలో గతేడాది మే నాటికి 6.22 మీటర్లు ఉన్న భూగర్భ జలాలు ఈ ఏడాది మే నాటికి 7.98 మీటర్లుగా ఉంది. ఫలితంగా గతంలో ఎప్పుడు లేనివిధంగా నీటి సమస్యలు తలెత్తున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు..

జిల్లాలో వంశధార, నాగావళి, మహేంద్రతనయ నదుల నుంచి పరిమితికి మించి ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. అలాగే, చెరువులు, గెడ్డలను కబ్జా చేయడం లేదా పూడ్చివేయడంతో వర్షపు నీరు ఇంకే పరిస్థితి ఉండడం లేదు. దీంతో భూ గర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. అయితే ఇటీవల అడపదడప వర్షాలు పడుతుండడంతో కొంత వరకు భూగర్భ జలాలు పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. పట్టణ ప్రాంత ప్రజలు నీరు లేక ఆందోళన చెందుతున్నారు. అలాగే, మైదాన ప్రాంతాల్లో ఉన్న గ్రామాలతో పాటు కొండలపై ఉన్న గిరిజన గ్రామాల్లో కూడా తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నీటి సంరక్షణకు ప్రతిఒక్కరూ అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రతి ఇల్లు, అపార్‌మెంట్ ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, నీటి రీసైక్లింగ్ విధానం అమలు చేయాలని, డబ్బు మాదిరిగానే నీటిని వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు.



పొలాల్లోని బావుల నుంచి నీరు తెచ్చుకుంటున్న మర్రిపాడు మహిళలు

దిక్సూచి DIKSUCHI

సైన్స్ విద్యార్థుల కోసం

టెన్త్, ఇంటర్ తరవాత What Next

(నిన్నటి పేజీ తరువాయి)

హోమ్ సైన్స్ అండ్ ఫుడ్ టెక్నాలజీ

ఇంటర్ బైపీసీతో పూర్తిచేసినవారు ఈ కోర్సుల్లో చేరవచ్చు. న్యూట్రిషనిస్ట్, డైటీషియన్స్, ఫుడ్ టెక్నాలజిస్టులుగా ఉపాధి లభిస్తుంది. సమతుల ఆహారంపై ఈ మధ్య కాలంలో అందరికీ ఆసక్తి ఏర్పడటంతో ప్రైవేటు రంగంలోనూ ఇబ్బడిముబ్బడిగా అవకాశాలు పెరుగుతున్నాయి. ముడి ఆహార పదార్థాలను మనుషులు, జంతువులు ఆసక్తిగా, అవసరమైనప్పుడు తినేట్టు చేయడమే ఫుడ్ టెక్నాలజీ కోర్సు. వివిధ పద్ధతులు ఆచరించి, మరికొన్ని కలిపి ఆహార పదార్థాలు రుచికితోడు నిల్వ ఉండేలా చేస్తుంటారు. ప్రస్తుతం దేశంలో మూడు కోట్లమంది నెలలో ఎక్కువ రోజులు ప్యాకేజీ ఫుడ్‌పై ఆధారపడి ఉన్నారు. మరో రెండు కోట్ల మంది త్వరలోనే ఈ జాబితాలో చేరే పరిస్థితిలో ఉన్నారని సర్వేలు చెబుతున్నాయి. అందుకే దేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఐదో స్థానంలో ఉన్నాయి.
ఫుడ్ టెక్నాలజీ పరిశ్రమలో ఆర్గానిక్ కెమిస్టులు, బయోకెమిస్టులు, అనలిటికల్ కెమిస్టులు, హౌస్ ఎకనమిస్టులు, ఇంజనీర్లు(కెమికల్, మెకానికల్, ఇండస్ట్రియల్, ఎలక్ట్రికల్, అగ్రికల్చరల్, సివిల్, ప్యాకింగ్), రీసెర్చ్ సైంటిస్టులు, మేనేజర్లు, అకౌంటెంట్‌లు మొదలైన వారికి అవకాశాలు ఉంటాయి. ఎంపిసి, బైపిసితో ఇంటర్ పూర్తిచేసి ఈ రంగంలోకి వెళ్లవచ్చు.



కోర్సు అందించే కొన్ని సంస్థలు

- Acharya N.G. Ranga Agricultural University, Bapatla, Andhra Pradesh,
- Prof. Jayasankar Agricultural University, Rajendra Nagar, Hyderabad-500030,
- Central Food Technology Research Institute, Mysore-570020, Karnataka.
- Central Institute of Fisheries Education, Fisheries University Road, Seven Bungalows, Andheri(W), Mumbai - 400061, Maharashtra, Website: www.cife.edu.in
- College of Agricultural Technology, Marathwada Krishi Vidyapeeth, Parbani-431402, Maharashtra.
- CSK Krishi Vishwa Vidyalaya, Palamuru-176060, Himachala Pradesh, Website: www.hillagric.org
- Govind Ballabh Pant University of Agriculture and Technology, Pantnagar-263145, Dist. Udham Singh Nagar, Uttarakhand, Website: www.gbpuat.ac.in
- Guru Nanak Dev University , Department of Food Science & Technology, Amritsar-143005, Punjab, Website: www.gndu.ac.in
- Harcourt Butler Technological Institute, Nawab Ganj, Kanpur-208002, Uttar Pradesh, Website: www.hbti.ac.in
- IIT(Indian Institute of Technology), Kharagpur - 721302, West Bengal.
- Jadhavpur University, Department of Food and Technology and Biochemical Engineering, 188 Raja S.C Malik Road, Kolkata-200032, West Bengal, Website: www.jadavpur.edu
- Mahatma Gandhi University, Priyadarshini Hills PO, Kottayam-686560, Kerala, Website: www.mguniversity.edu
- Manipur University, Canchipur, Imphal, Manipur,Website: www.manipuruniv.ac.in
- M.S.University, Vadodara-390002, Gujarat, Website: www.msuboroda.ac.in
- National Dairy Research Institute, NDRI Deemed University Karnal-132001, Haryana, Website: www.karnal.nic.in
- National Sugar Institute, P.O: NSI Kalyanpur, Kanpur-208017, UttarPradesh.

క్యాబిన్ క్రూ

క్యాబిన్ క్రూ అంటే విమానంలో పనిచేసే సిబ్బంది. ప్రయాణికులు విమానంలో ఎక్కడానికి ముందు ప్రారంభమై, వారిని సురక్షితంగా చేర్చేంత వరకు కొనసాగుతుంది. సాధారణంగా వారానికి 30 వరకు పనిగంటలు ఉంటాయి. అయితే ఇతర ఉద్యోగుల్లా రోజుకు ఇన్ని గంటలు ఉండే అవకాశం ఉండదు. ఒకే రోజు 20 గంటలు కూడా పనిచేయాల్సి రావచ్చు. అయినా ఒత్తిడిని ఏమాత్రం దరిచేరనీయకుండా చూసుకోవాలి. క్యాబిన్ క్రూలో చేరడానికి సాధారణంగా డిగ్రీని అర్హతగా పరిగణిస్తారు. వయసు 19-27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. కొన్ని ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ సంస్థలు ఇంటర్ పాసైనవారికీ ఉద్యోగాలు ఇస్తాయి. అలాంటివారి వయసు 18-21 సంవత్సరాల మధ్యలో ఉండాలి. హోటల్ మేనేజ్‌మెంట్/ టూరిజం డిప్లొమా ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. ఎయిర్ హోస్టెస్‌లకు ప్రత్యేక శిక్షణ కూడా ఉంటుంది. ఫస్ట్‌ఎయిడ్ తదితరాలను నేర్పిస్తారు. ఇక్కడ పని చేయాలనుకునే వారికి హిందీ, ఇంగ్లీషు భాషలు తప్పనిసరిగా వచ్చి ఉండాలి. పెద్ద పెద్ద సంస్థలు ఎయిర్ హోస్టెస్‌లకు మంచి మొత్తంలో జీతాలుగా ఇస్తాయి.

పారా మెడికల్

సాధారణంగా రోగులు డాక్టర్ల దగ్గరికి వెళ్లిన తరవాత పలు రకాలు టెస్టులు చేయించుకోవాల్సి ఉంటుంది. వీటన్నింటినీ డాక్టర్లు నిర్వహించరు. ఈ విషయంలో పారా మెడికల్ సిబ్బంది సహాయపడతారు. పారా మెడికల్ కోర్సుల్లో ఆప్టోమెట్రీ, ల్యాబ్ టెక్నాలజీ, ఫిజియోథెరపీ, రీహాబిలిటేషన్ మొదలైనవన్నీ ఉంటాయి. ఈ కోర్సుల్లోని చాలా విభాగాల్లో ఉద్యోగ అవకాశాలతో పాటు, స్వయం ఉపాధికి కూడా అవకాశం ఉంటుంది.

ఫోరెన్సిక్ సైన్స్

ఫోరెన్సిక్ అనేది లాటిన్ పదం. ఫోరెన్సిక్ సైన్స్ అనేది నేరాలను శాస్త్రీయంగా నిర్ధారించే శాస్త్రం. ఫిజికల్, మెడికల్, బయోలాజికల్, మెడికల్ తదితర సబ్జెక్టుల నుంచి పుట్టిన శాస్త్రం ఇది. మొదటిసారిగా భారత ప్రభుత్వం 1972లో న్యూఢిల్లీలో లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రిమినాలజీ అండ్ ఫోరెన్సిక్‌సైన్స్(www.nicfs.nic.in)ను ఏర్పాటు చేసింది. ఇది కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఈ సంస్థ ఇప్పటి వరకు వేలాది మందికి ఫోరెన్సిక్ సైన్స్‌లో శిక్షణ ఇచ్చింది. వీరిలో ప్రపంచంలోని 200 దేశాలవారు ఉన్నారు. ఢిల్లీ ఇన్‌స్టిట్యూట్‌తోపాటు కోల్‌కతా, హైదరాబాద్, చండీగఢ్‌లో ఫోరెన్సిక్ లేబొరేటరీలను ఏర్పాటు చేసింది. క్రిమినాలజీలో ఎంఏ, ఫోరెన్సిక్ సైన్స్‌లో ఎమ్మెస్సీ కోర్సును ఎల్ఎన్‌జెపి - ఎన్ఐసిఎఫ్ఎస్ అందిస్తోంది. ఒక్కో దానిలో 20 సీట్లు ఉన్నాయి. ఇక్కడ పీజీ డిప్లొమా ఇన్ డాక్యుమెంటేషన్, ఫోరెన్సిక్ బాలిస్టిక్, ఫోరెన్సిక్ బయాలజీలతో పాటు కొన్ని షార్ట్‌టర్మ్ కోర్సులు కూడా ఉన్నాయి. ఫోరెన్సిక్ సైన్స్‌కు సంబంధించి దేశంలోని పలు యూనివర్సిటీలు వివిధ కోర్సులను అందిస్తున్నాయి. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఏ ఇన్ క్రిమినల్ జస్టిస్ కోర్సు ఉంది. ఏ డిగ్రీ చేసినవారైనా ఈ కోర్సులో చేరొచ్చు. అదేవిధంగా గుజరాత్‌లోని గాంధీనగర్‌లో గుజరాత్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ (www.gfsu.edu.in) కూడా ఉంది.

కోర్సు అందించే కొన్ని సంస్థలు

- Anna University (Chennai 600025) - Post - BE Diploma in Forensic Engineering
- Bundelkhand University (Jhansi 284128)-PG Diploma in Forensic Science
- PG Diploma in Criminology; University of Delhi (Delhi 110007)-Certificate in Forensic Science(3 months)
- Dr. B.R. Ambedkar University(Agra 282004) -MSc(Forensic Science)
- Dr.Hari Singh Gour Vishwavidyalay (Sagar 470003)-MSc. (Criminology), MA (Criminal and Forensic Science).
- Karnataka University (Dharwad-580003)-MA (Criminology and Forensic Science)
- Lucknow University (Lucknow 226007)-PG Diploma in Forensic Anthropology
- University of Madras (Chennai 600005)-MA (Criminology), and MSc. (Forensic Science)
- Osmania University (Hyderabad 500007)-MSc. (Forensic Science Laboratory)
- Panjab University(Chandigarh 160014)-PG Diploma in Forensic Science and Criminal Science.
  1- Punjabi University (Patiala 147002) - MSc(Forensic Science)
- Amity University (Sector 44, Noida-UP) BSc. and MSc. (Forensic Science).

ఫిజికల్, కెమికల్ అండ్ ఎర్త్ సైంటిస్టులు

ఇంజనీరింగ్ ద్వారా కెమికల్ ఇంజనీరింగ్ చేయవచ్చు. బీఎస్సీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చేసిన వారికి కూడా కెమికల్‌కు సంబంధించిన స్పెషలైజ్డ్ డిప్లొమాలు ఉన్నాయి. జేఎన్‌టీయూ, ఆంధ్రా, ఓయూలలో కొన్ని కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. ఫిజిక్స్, మేథ్స్‌లో కూడా ఇలాంటి కోర్సులు ఉన్నాయి. డిగ్రీ/పీజీల్లో జాగ్రఫీ సబ్జెక్టులు చదివిన వారు జియాలజిస్టులుగా వెళ్లవచ్చు. ఓషనోగ్రఫీకి సంబంధించిన కోర్సులు ఆంధ్రా యూనివర్సిటీలో ఉన్నాయి. కెమికల్ ఇండస్ట్రీ, ఫిజిక్స్ అండ్ అలైడ్ ఫీల్డ్‌లో ఉపాధి ఉంటుంది. మేథమెటీషియన్స్ అండ్ స్టాటిస్టీషియన్స్, జియాలజిస్టులుగా, జాగ్రఫీ అండ్ జాగ్రఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ స్పెషలిస్టులుగా, మెట్రోలాజిస్టులుగా, ఓషనోగ్రాఫర్లుగా అవకాశాలుంటాయి.

ఆర్కిటెక్చర్ & కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ

మేథ్స్‌తో ఇంటర్ పూర్తిచేసినవారు ఇందులో ఇంజనీరింగ్ చేయవచ్చు. టెన్త్ తరవాత పాలిటెక్నిక్ డిప్లొమా ఆధారంగా కూడా సర్టిఫికెట్ పొందవచ్చు. ఆర్కిటెక్చర్, నేవల్ ఆర్కిటెక్చర్, కన్‌స్ట్రక్షన్ రంగాల్లో ఉద్యోగాలుంటాయి.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/cjd3qajలో చదవండి.

మర్చెంట్ నేవీ

ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతులు, దిగుమతులు ఎక్కువ మొత్తం నౌకా రవాణా ద్వారానే జరుగుతున్నాయి. అందుకు కారణం మిగిలిన రవాణాలతో పోలిస్తే ఇది చాలా చౌక. అందుకే ప్రపంచ వ్యాప్తంగా షిప్పింగ్ ఇండస్ట్రీకి మంచి ఆదరణ ఉంది. మర్చెంట్ నేవీలోకి వెళ్లినవారికి అనుకూలతలు, ప్రతికూలతలు రెండూ ఉన్నాయి. కొత్త కొత్త ప్రదేశాలకు వెళ్లడం వీరికి అనుకూలత. అయితే నెలల తరబడి సముద్ర ప్రయాణంలోనే జీవితం గడిచిపోతుంది. కుటుంబ జీవితం కూడా దూరమవుతుంది. నేవిగేటింగ్ ఆఫీసర్, రేడియో ఆఫీసర్, మెరైన్ ఇంజనీర్స్ తదితరాల్లో కెరీర్ వెతుక్కోవచ్చు. ఇప్పటివరకు ఇందులో మహిళలకు అవకాశాలు లేవు. అయితే షిప్ డాక్టర్లు, రేడియో ఆఫీసర్లుగా ఇప్పుడిప్పుడు వారు ఇందులోకి ఎంటర్ అవుతున్నారు. కోల్‌కతాలోని మెరైన్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ముంబైలోని చాణక్యలో చేరాలంటే మాత్రం జెఇఇలో ర్యాంకు సాధించాల్సి ఉంటుంది.

ఇవికాకుండా... మర్చెంట్ నేవీలో శిక్షణ ఇచ్చే సంస్థలు

- Indian Maritime University (T.S. Chanakya), Karave Village, Sector 34, Nerul, Navi Mumbai, Maharashtra 400706, Ph: 022 2770 3876.
- Praveenya Institute of Marine Engineering & Maritime Studies (PRIME), D.No.-1-74-15, Plot No.61/3,Sector 3, MVP Colony, Visakhapatnam, Andhra Pradesh 530017,
- AMET UNIVERSITY, Plot No.135, East Coast Road, Kanathur, Chennai, Tamil Nadu 603112, Ph: 044 2747 2904.
- Commander Ali's Academy of Merchant Navy, Commander Ali's Estates, Survey No.469, Donthi, Shivampet Mandal, Medak District, Telangana 502334.
- Dr.B.R.Ambedkar Institute of Technology, Polytechnic Road, Pahargaon,, Junglighat, Port Blair, Andaman and Nicobar Islands 744103, Ph: 03192 259 693.
- Indian Maritime College, Masilamani Street, T.Nagar, Chennai-600 0178. Ph: 044 2433 6953
- NUSI MARITIME ACADEMY, NUSIWA-DO, Socaldem,Chinchinim, Salcette-Goa-403715, Ph: 0832 277 3859

(మిగిలిన వివరాలు రేపటి పేజీలో)

నవ్య | చిత్రజ్యోతి

గుడి కోసం ఎన్టీఆర్ విరాళం



చిన్న సాయం చేసి ఆ విషయం ఊరంతా చాటుకుంటున్న రోజులివి. కానీ ఓ మంచి పని కోసం లక్షల రూపాయల విరాళం ఇచ్చి కూడా ఆ విషయం ఎక్కడా ఎవరికీ చెప్పకుండా మౌనంగా వహించి తన ప్రత్యేకత మరోసారి చాటుకున్నారు జూనియర్ ఎన్టీఆర్. విషయం ఏమిటంటే.. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలోని జగ్గన్న పేటలో ఉన్న వీరభద్రస్వామి దేవాలయానికి ఎన్టీఆర్ రూ. 12.50 లక్షల విరాళం ఇచ్చారు. ఇది ఎప్పుడు ఇచ్చారో కూడా ఎవరికీ తెలీదు. చిన్న ఊరు, చిన్న గుడి కావడంతో ఈ విషయం బయటకు కూడా రాలేదు. అయితే ఇటీవల ఎవరో ఆ గుడికి వెళ్లి అక్కడున్న శిలా ఫలకం మీద జూనియర్ ఎన్టీఆర్ పేరు చూసి ఆ విషయాన్ని సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అందరికీ తెలిసింది. ఎన్టీఆర్ మంచి మనసుకి ఫిదా అయిన నెటిజన్లు ఆయనకు అభినందనలు తెలుపుతూ కామెంట్స్ పెడుతున్నారు.

డబుల్ డోస్... దిమాకీ కిరికిరి



రామ్ పోతినేని, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన బ్లాక్ బస్టర్ 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా వస్తున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. హీరో పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ 'దిమాకీ కిరికిరి' పేరుతో టీజర్ విడుదల చేశారు. ఇందులో రామ్ ఇస్మార్ట్‌నెస్, కావ్యా థాపర్ పరిచయం, సంజయ్‌దత్ పవర్‌ఫుల్ ఎంట్రీ అలరించాయి. అద్భుత శివలింగం, క్లైమాక్స్ ఫైట్ - భారీ జనసమూహం కూడా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాలో కూడా స్పిర్చువల్ టచ్ ఉంటుందని హింట్ ఇచ్చారు దర్శకుడు పూరి. హైదరాబాద్ యాసలో రామ్ చెప్పే డైలాగులు, మాస్ యాక్షన్ ప్యాక్డ్ అవతార్ అలరించాయి. డబుల్ ఎనర్జీ, డబుల్ ఫన్‌తో ఈ సినిమా ఉంటుందని టీజర్ చూడగానే అర్థమవుతుంది.
తెలుగు, తమిళ, కన్నడ, మలయాల, హిందీ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయడానికి నిర్మాతలు పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ సన్నాహాలు చేస్తున్నారు.

వినోదానికి తెర



● నెలాఖరు దాకా సింగిల్ స్క్రీన్ థియేటర్ల మూత

పరీక్షల సీజన్, ఇండియన్ ప్రీమియర్ లీగ్, సార్వత్రిక ఎన్నికలు.. ఇలా అన్నీ ఒకేసారి రావడంతో థియేటర్లకు వెళ్లే జనమే కరువయ్యారు. మినిమం ఆక్యుపెన్సీ కూడా లేకపోవడంతో నష్టాలను తట్టుకోలేక కొన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్లు దాదాపు రెండు వారాల పాటు మూతపడనున్నాయి. పెద్ద సినిమాలేవీ ఇప్పట్లో లేకపోవడం, చిన్న సినిమాలను చూసేందుకు ప్రేక్షకుడు ఆసక్తి చూపకపోవడం వల్ల రోజురోజుకీ థియేటర్లలో ఆక్యుపెన్సీ తగ్గిపోతోంది. ఈ కారణంగానే ఈనెల 17 నుంచి నెలాఖరు వరకూ థియేటర్లను స్వచ్ఛందంగా మూసేయ్యాలని కొంతమంది థియేటర్ యజమానులు నిర్ణయించుకున్నారు. తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్‌కు, ఈ నిర్ణయానికీ ఎలాంటి సంబంధం లేదని, ఇప్పట్లో పెద్ద సినిమాల విడుదల లేకపోవడంతోనే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని ఓ ఎగ్జిబిటర్ వెల్లడించారు. రోజువారీ ఖర్చులు కూడా గిట్టుబాటు కాని పరిస్థితుల్లో నష్టాలను తగ్గించు కోవడానికి థియేటర్ రన్ తాత్కాలికంగా ఆపడం తప్ప వేరే మార్గం లేదని ఆయన వాపోయారు. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం బాధాకరమే అయినా తప్పడం లేదని మరికొంత మంది థియేటర్ యజమానులు చెప్పారు.

నష్టాలు వస్తున్నా మొండిగా నడుపుతున్నాం

అయితే తాము థియేటర్లను మూత వేయడం లేదని ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సుదర్శన్ థియేటర్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. నాలుగు షోలకు బదులుగా ఐదు షోలు వేయబోతున్నామని చెప్పారు. కొన్ని థియేటర్ల యజమానులు మాత్రమే ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చన్నారు. జంట నగరాల్లో, ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఇలా థియేటర్లు మూత వేస్తున్న వారు ఎవరూ లేరన్నారు. నగర శివార్లు, తాలూకాలలో కొన్ని చోట్ల ఇలా చేస్తుండవచ్చన్నారు. సినిమాలు లేవని థియేటర్ మూత వేస్తే అది థియేటర్ రన్‌పై నెగిటివ్ ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదు, అందుకే మూతేయడం ఇష్టం లేక, కష్టమైనా నడుపుతున్నాం అని సంధ్య థియేటర్ మేనేజర్ మధుసూదన్ తెలిపారు. వీరి బాటలోనే మరి కొంతమంది థియేటర్ల యజమానులు కూడా తమ నిర్ణయాన్ని మార్చుకొని ప్రదర్శనలను కొనసాగించనున్నట్లు తెలిపారు. పెద్ద సినిమాలు రిలీజ్ అవ్వకపోయినా ప్రస్తుతానికి చిన్న సినిమాలనే ప్రదర్శిస్తామని చెబుతున్నారు.

కనీసం పదిమంది ఉండడం లేదు

కనీసం పదిమంది అయినా వస్తేనే షో వేస్తున్నాం. ఇటీవలే విడుదలైన ఒక సినిమాకు మూడు షోలు అలాగే వేశాం. నాలుగో షోకు అంతమంది జనం లేకపోవడంతో రద్దు చేశాం. మల్టీప్లెక్స్‌ల్లో కూడా ఇదే జరుగుతోంది. థియేటర్ దగ్గరకొచ్చాక షో బంద్ అనడంతో కొన్నిసార్లు ప్రేక్షకులతో గొడవలు అవుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో మల్టీప్లెక్స్‌లతో కలిపి 1900 స్క్రీన్లు ఉన్నాయి. దాదాపు అన్నింటిలోనూ ఇదే పరిస్థితి. మిడ్‌రేంజ్ సినిమాలకు కూడా నిర్మాతలు షేర్ గ్యారంటీలు, అడ్వాన్స్‌లు అడుగుతున్నారు. ఇన్ని ఇబ్బందుల మధ్య మేం రిస్క్ చేయాలని అనుకోవడం లేదు. నిర్మాతలు ముందుకు వచ్చి తగిన సహకారం అందిస్తే సినిమాలు ప్రదర్శిస్తాం.

-విజయేందర్ రెడ్డి,
తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్.

భార్యాభర్తల ఈగోల గోల



రాహుల్ విజయ్, శివానీ జంటగా నటించిన 'విద్య వాసుల అహం' వెబ్ సిరీస్ ఈ నెల 17న ఆహాలో స్ట్రీమింగ్ అవుతోంది. మణికాంత్ గెల్లి దర్శకత్వంలో మహేశ్ దత్తా, లక్ష్మీ నవ్య నిర్మించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ .. కొత్తగా పెళ్లయిన విద్య, వాసు అహంకారాన్ని వీడి తమ కాపురాన్ని ఎలా చక్కదిద్దుకున్నారనే ఇతివృత్తంతో సిరీస్‌ను రూపొందించినట్లు చెప్పారు. ఇది కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అనీ, ఇందులోని నాలుగు పాటలను నాలుగు రకాలుగా సంగీత దర్శకుడు కల్యాణీ మాలిక్ కంపోజ్ చేశారని తెలిపారు. హీరోయిన్ శివానీని కూడా ఆయనే రికమెండ్ చేశారని మణికాంత్ గెల్లి చెప్పారు.
హీరో రాహుల్ మాట్లాడుతూ 'ఇదొక క్యూట్ ఈగోస్ ఫన్ ఫిల్మ్. హాయిగా ఫ్యామిలీతో కలసి చూస్తూ ఎంజాయ్ చెయ్యవచ్చు' అన్నారు.
'ఈ టీమ్‌తో నాకు రెండేళ్ల నుంచి అనుబంధం ఉంది. దర్శకుడు మణికాంత్ కథ చెప్పగానే హీరో ఎవరని అడిగాను. రాహుల్ విజయ్ అని చెప్పగానే హ్యాపీగా ఫీల్ అయ్యాను. ఈ ప్రాజెక్ట్ ఒప్పుకొన్న వారం రోజులకి 'కోట బొమ్మాళి' చిత్రం ఓకే అయింది. అలా రెండేళ్లుగా రాహుల్‌తోనే వర్క్ చేస్తున్నాను. ఏ మాత్రం ఈగో లేని వ్యక్తి' అని శివానీ చెప్పారు.

ట్రెండ్ సెట్ చేస్తుంది



'మంత్ర, మంగళ' లాంటి లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో దర్శకుడిగా మంచి విజయాలను అందుకున్నారు ఓషో తులసిరామ్. ఈసారి ఆయన సైకో థ్రిల్లర్ చిత్రం 'దక్షిణ'తో ప్రేక్షకులను భయపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. కల్ట్ కాన్సెప్ట్స్ మూవీ బేనర్‌పై అశోక్ షిండే ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'కబాలి' ఫేమ్ సాయిధన్సిక ఇందులో లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు బుచ్చిబాబు సానా చేతుల మీదుగా యూనిట్ బుధవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ మధ్య కాలంలో నన్ను భయపెట్టిన ట్రైలర్ ఇదే. 'దక్షిణ' చిత్రంతో తులసిరామ్ గారు టాలీవుడ్‌కి మరో ట్రెండ్ సెట్టర్ సైకో థ్రిల్లర్‌ను ఇవ్వబోతున్నారు' అని ప్రశంసించారు. నిర్మాత మాట్లాడుతూ "దక్షిణ' సినిమా ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ థ్రిల్‌ను ఇస్తుంది. తర్వాతేం జరుగుతుందో అనే ఉత్కంఠను ప్రేక్షకులు అనుభవిస్తారు, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం" అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/6BEI2IA
లో చదవండి.

వణుకుతున్న నదీ తీర గ్రామాలు

- పూర్తికాని కరకట్టల నిర్మాణం
- ఏటా తప్పని ఇబ్బందులు
- కోతకు గురవుతున్న పంట పొలాలు
- పట్టించుకోని అధికారులు



ఆమదాలవలస మండలం జీకేవలస వద్ద కోతకు గురైన నాగావళి నది గట్టు



పురుషోత్తపురం వద్ద కోతకు గురైన వంశధార నది గట్టు

(సరుబుజ్జిలి)

వంశధార, నాగావళి నదీ తీర ప్రాంత గ్రామాల ప్రజలు ఏటా వరదల సమయంలో రోజుల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరదల ధాటికి ఏటా నదీ తీరాలు కోతకుగురై పంట పొలాల్లోకి, గ్రామాల్లోకి నీరు ప్రవేశిస్తుండడంతో ఇక్కట్లు తప్పడం లేదు. వరదల బారి నుంచి గ్రామాలను రక్షించేందుకు కరకట్టల నిర్మాణం చేపట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. 2009లో కరకట్టల పనుల నిర్మాణం చేపట్టి కొద్ది నెలల్లోనే నిలిపివేశారు. 10 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. దీంతో ప్రతి ఏటా వరద బారిన పడి పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నదీతీర ప్రాంతాల వాసుల ఇక్కట్లను పరిష్కరించడంలో ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కరకట్టల నిర్మాణంతోనే వరద సమస్యకు శాశ్వత పరిష్కారమని చెప్పిన వంశధార అధికారుల జాడ కనిపించడం లేదు. జిల్లాలోని వంశధార, నాగావళి నదులకు ఆనుకుని ఉన్న పలు మండలాల పరిధిలోని గ్రామాల ప్రజలు వర్షాకాలంలో బిక్కుబిక్కుమంటూ జీవనం గడపాల్సిన పరిస్థితి ఎదురవు తోంది. హిరమండలం, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస, జలుమూరు, గార తదితర మండలాల పరిధిలో వరదల సమయంలో ఇళ్లలోకి నీరు చేరడమే కాకుండా, గట్టు కోతకు గురై విలువైన భూములు కోల్పోవాల్సిన పరిస్థితి. నదీ తీరంలో ఉన్న జీడి, మామిడి తదితర పొలాలు కోతకు గురై పంటలు నష్టపోవాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదనకు గురవుతున్నారు. కరకట్టల నిర్మాణంపై అధికారులు హామీలే తప్ప అమలు కానరావడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. జలుమూరు మండలంలో కరకవలస, శ్రీముఖలింగం, నగరికటకం, అచ్యుతాపురం గ్రామాల పరిధిలో కరకట్ట పనులు అరకొరగా చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. కొమనాపల్లి, మాకివలస, పర్లాం, రామకృష్ణా పురం, అందవరం, ఉప్పరపేట, దొంపాక, సురవరం తదితర గ్రామాల వద్ద కరకట్టలు నిర్మించాల్సి ఉన్నప్పటికీ నేటికీ ప్రారంభించక పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు వరదల సమయంలో నష్ట పోతున్నారు. ఆమదాలవలస మండల పరిధిలో చెవ్వాకులపేట, నాందపురం తదితర గ్రామాలు వరద నీటికి ముంపునకు గురవుతున్నాయి. వరదలు వస్తే ఈ రెండు గ్రామాలకు అధికారులు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంటోంది.

నిర్మాణ ప్రదేశాలివే..

కరకట్టల నిర్మాణం పనులు నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. బత్తిలి నుంచి సిరుసువాడ వరకు రూ.63 కోట్లు, సిరుసువాడ నుంచి ఎల్ఎన్‌పేట వరకు రూ.57 కోట్లు, పురుషోత్తపురం నుంచి కళింగ పట్నం వరకు రూ.25 కోట్లు, జలుమూరు నుంచి సముద్రతీరం వరకు రూ.69 కోట్లు కేటాయించారు. సరు బుజ్జిలి మండలంలోని అగ్రహారం నుంచి అల్మాజీపేట వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర వంశధార తీర ప్రాంతం విస్తరించి ఉంది. అగ్రహారం నుంచి ఫకీర్ సాహెబ్ పేటవరకు రెండు ప్యాకేజీల్లో పనులను టెండర్లు పిలిచారు. మొదటి ప్యాకేజీలో ఎల్‌పిఎం అగ్రహారం నుంచి పెద్దమాలపేట వరకు కరకట్ట నిర్మాణం పనులు రూ.8 కోట్లు, పెద్ద వెంకటాపురం నుంచి ఫకీర్‌సాహెబ్‌పేట వరకు రూ.6.24 కోట్లు మంజూరు చేశారు. అయితే మొదటి ప్యాకేజీలో పెద్దమాలపేట వరకు పనులు చేపట్టి వదిలేశారు. రెండో ప్యాకేజీలో పెద్ద వెంకటాపురం నుంచి ఫకీర్‌సాహెబ్‌పేట వరకు పనులు మొదలు పెట్టిన తర్వాత కాంట్రాక్టర్ ఒప్పందం రద్దు చేసుకుని వెళ్లిపోయాడు. వరదల వల్ల మండలంలోని అగ్రహారం, పాతపాడు, తెలికిపెంట, యరగాం, కాగితాపల్లి, పెదమాలపేట, పెద్దసవలాపురం, చినవెంకటాపురం, పాలవలస, పురుషోత్తపురం, అలమాజీపేట, ఫకీర్‌సాహెబ్‌పేట గ్రామాలు నష్టాలకు గురవుతున్నాయి. ఆమదాలవలస మండలంలోని నిమ్మతొర్లాడ, కొరపాం, బెలమాం, లొద్దలపేట, ముద్దాడపేట, కలివరం, తొగరాం, పొందూరు మండలం సింగూరు, బొడ్డేపల్లి, బూర్జ మండలం ఖండ్యాం, గుత్తావల్లి, నారాయణపురం గ్రామాల ప్రజలు వరదలకు నష్టంబారిన పడుతున్నారు.

సగంలో నిలిచిన పనులు..

టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రెండు నదుల తీర ప్రాంతాల్లో కరకట్టల నిర్మాణాలకు కార్య రూపం ఇచ్చారు. అయితే ఆ తరువాత ప్రభుత్వం మారడంతో పాలకులు నిర్మాణాలపై దృష్టి సారించ లేదు. దీనివల్ల పలు ప్రాంతాల్లో కరకట్టల నిర్మాణాలు సగంలో నిలిచిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఏటా ఇబ్బందులు పడుతున్నాం..

నది ఒడ్డునే నివసిస్తున్నాం. వర్షాకాలంలో వరదల వల్ల ఎప్పుడు నీరు గ్రామాల్లోకి వస్తుందోనని నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం. కనీసం రాతికట్టు గ్రోయిన్లు కూడా నిర్మించకపోవడం వల్ల విలువైన భూములు, ఇళ్లు కోల్పోతున్నాం. ప్రతిఏటా ఇబ్బందులు తప్పడం లేదు.

-రమణబాబు, తెలికిపెంట

కరకట్టలు నిర్మించాలి..

కాంగ్రెస్ ప్రభుత్వంలో కరకట్టల నిర్మాణం పనులు ప్రారంభించినా ఆ తరువాత పనులు ముందుకు సాగలేదు. గత ప్రభుత్వం కొత్త టెండర్లతో హంగామా చేసినా పనులు ప్రారంభించలేదు. గ్రామాల్లో కరక ట్టల నిర్మాణం కోసం భూముల సేకరణ పూర్తి చేసినా పరిహారం అందించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు.

-జి.మోహనరావు, ఎం.ఎస్.పురం

ప్రతిపాదనలు పంపించాం..

బత్తిలి నుంచి కళింగపట్నం వరకు నిర్మించాల్సిన కరకట్టల నిర్మాణం పనులకు అవసరమైన నిధులు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

-వల్లూరు సుధాకరరావు, వంశధార డీఈ

పేదల పక్షాన శ్రీరాములు పోరాటం



టెక్కలి: శ్రీరాములుకు నివాళి అర్పిస్తున్న నేతలు

టెక్కలి: సీపీఎం సీనియర్ నాయకుడు బమ్మిడి శ్రీరాములు సుదీర్ఘకాలం ప్రజా సమస్యల పోరాటంలో పాల్గొని స్ఫూర్తిగా నిలిచారని పలువురు వక్తలు అన్నారు. బమ్మిడి శ్రీరాములు సంస్మరణ సభ బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటానికి నంబూరు షణ్ముఖరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ శ్రీరాములు వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లిలో ఉంటూ జిల్లాలో అనేకమంది ఉద్యమకారులను తయారుచేశారన్నారు. టెక్కలిలో పినకాన కృష్ణమూర్తితో కలిసి పోరాటాల్లో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో కొల్లి ఎల్లయ్య, హనుమంతు ఈశ్వరరావు, బగాది వాసుదేవ రావు, ఉర్జాన లక్ష్మణరావు, అనపాన షణ్ముఖరావు, మెట్ట దాసు తదితరులు పాల్గొన్నారు.

రేపు నగరంపల్లిలో సంస్మరణ సభ

వజ్రపుకొత్తూరు: గిరిజన సంఘం ఉద్యమ నాయకుడు, సీపీఎం నేత బమ్మిడి శ్రీరాములు సంస్మరణ సభ శుక్రవారం నగరంపల్లిలో నిర్వహిస్తున్నట్లు సీపీఎం నాయకుడు నెయ్యిల మోహనరావు తెలిపారు. ప్రతిఒక్కరూ హాజరు కావాలని ఆయన కోరారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయండి



ఎంపీ రామ్మోహన్‌నాయుడుకు ఆహ్వానపత్రం అందిస్తున్న నిర్వాహకులు

నరసన్నపేట: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 18 నుంచి నిర్వహించనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు హాజరై విజయవంతం చేయాలని ఆలయకమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యేలు కింజరాపు అచ్చెన్నాయుడు, ధర్మాన కృష్ణదాస్, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిలకు ఆహ్వాన పత్రికలను అందేశారు. పదో రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకుడు చామర్తి కృష్ణమాచార్యులు, ధర్మకర్త పొట్నూరు చిన్నభద్రస్వామి, సత్యవరగ్రహార పండితులు మావుడూరి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పంచ ఘటాల ఊరేగింపు



ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేటలో జరుగుతున్న బంగారు సంతోషి అమ్మ (గ్రామదేవత) వారి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి పంచ ఘటాలను గ్రామస్థులు ఊరేగించారు. సంప్రదాయనుసారంగా మంగళ వాయిద్యాలతో గ్రామంలోని వీధుల్లో ఊరేగించి అమ్మవారి గుడి వద్దకు చేర్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

శర్మకు 27వ ర్యాంకు



నందిగాం: ఏపీఆర్‌జేసీ ప్రవేశ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నందిగాం మండలం నర్సిపురం గ్రామానికి చెందిన మావడి జగన్నాథ శర్మకు రాష్ట్రస్థాయిలో 27వ ర్యాంకు వచ్చింది. మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఈ ర్యాంకు వచ్చిందని కుటుంబ సభ్యులు తెలిపారు. జగన్నాథ శర్మ నర్సిపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివాడు. ఈ సందర్భంగా విద్యార్థిని గ్రామస్థులు, తల్లిదండ్రులు శ్రీలక్ష్మి, సింహాచలం శర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

భవానీకి 53..

సంతబొమ్మాళి: ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలో లక్ష్మీపురానికి చెందిన పెద్దిన భవానీ రాష్ట్రస్థాయిలో 53వ ర్యాంక్ సాధించింది. ఈమెకు పాలిసెట్‌లో 550వ ర్యాంక్ కూడా వచ్చింది. బడే నరసాపురానికి చెందిన సుంకరి రంజిత 143 ర్యాంక్ సాధించింది. వీరిని సర్పంచ్ దుక్క భూషణ్ రెడ్డి, ఉపాధ్యాయులు షణ్ముఖ, శిమ్మన్న తదితరులు అభినందించారు.

మానసకు 182..



హిరమండలం: హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన జె.మానస ఏపీఆర్‌జేసీ ఎంట్రన్స్‌లో రాష్ట్రస్థాయిలో 182వ ర్యాంకు సాధించింది. ఉత్తమ ఫలితాలను సాధించిన మానసను హెచ్‌ఎం కేశవరావు బుధవారం అభినందించారు.

'కత్తిరి'కి ఎంపీ అభినందన



వెంకటరమణను అభినందిస్తున్న ఎంపీ

జలుమూరు (సారవకోట): టీడీపీ సోషల్ మీడియాలో చురుగ్గా పనిచేసి పార్టీకి సేవలందించిన టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణను ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడును అభినందించారు. బుధవారం శ్రీకాకుళం టీడీపీ క్యాంపు కార్యాలయంలో సైకిల్ జ్ఞాపికను అందించారు. పార్టీ యాప్‌లలో రాష్ట్రంలోని 19వ ర్యాంకు సాధించడం అభి నందనీయమని ఎంపీ అన్నారు. పార్టీ బలోపేతానికి తన శక్తివంచన లేకుండా పాటుపడతానని వెంకటరమణ పేర్కొన్నారు.

ఈనెల రేషన్ అందలేదు

- చిన్నదూగాం గ్రామస్థుల ఫిర్యాదు

జలుమూరు: మే నెలకు సంబంధించిన రేషన్ బియ్యం ఇప్పటి వరకు ఇవ్వలేదని చిన్నదూగాం గ్రామస్థులు వాపోయారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ సీహెచ్ నాగమ్మకు వినతిపత్రం అందించారు. ప్రతీ నెలా రేషన్ సరిపడా రావడం లేదన్న సాకుతో డీలర్ కొంద రికే ఇచ్చి మిగిలిన వారికి ఇవ్వడం లేదని ఫిర్యాదుచేశారు. ఈ నెలలో 25 కుటుంబా లకు బియ్యం ఇవ్వలేదని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ.. రేషన్ అంద ని లబ్ధిదారులకు రెండురోజుల్లో బియ్యం సర్దుబాటు చేస్తామన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

నరసన్నపేట: మేజర్ పంచాయతీల్లో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఈవో చిన్నారావు హెచ్చరించారు. బుధవారం రాజులు గట్టుపై అక్రమ నిర్మాణలను అడ్డుకున్నారు.

క్రికెట్ విజేత టెక్కలి

సంతబొమ్మాళి: ఉమిలాడలో గత 30 రోజులుగా జరుగుతున్న క్రికెట్ పోటీల్లో టెక్కలి కార్తీక్-11 విజేతగా నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్ పోటీలో మొదట బ్యాంటింగ్ చేసిన ఎం.సున్నాపల్లి జట్టు 12 ఓవర్లలో 78 పరుగులు చేయగా, టెక్కలి కార్తీక్ 11 9.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. విజేత జట్టుకు రూ.50 నగదు పురస్కారంతో పాటు ట్రోఫీని నిర్వాహకులు అందించారు.

కూటమి విజయం తథ్యం

రాళ్లపాడుకాలనీ(పోలాకి): అసెంబ్లీ, పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి కూటమి విజయం తథ్యమని ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నెపు వరప్రసాద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి తులసిపాటి కృష్ణంరాజు అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఓబీసీ సమస్యలను టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. చంద్రబాబు పాలనతోనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందన్నారు.

వరుణుడి కరుణతో ఆగిన అగ్నిప్రమాదం

పాతపట్నం: స్థానిక జోగి కొండపై బుధవారం మధ్యాహ్నం అగ్నికీలలు రాజుకున్నాయి. వెంటనే స్థానికులు అటవీ శాఖాధికారులకు సమాచారం ఇవ్వగా వారు అగ్నిమాపక శాఖకు విషయం తెలిపారు. అయితే కొద్దిసేపటికే వాతావరణం చల్లగా మారి వరుణుడు కరుణించి వర్షం కురవడంతో మంటలు ఆగిపోయాయి. జోగికొండ శివారులో జరిగిన అగ్ని ప్రమాదం నివారణకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉన్నా వాన కురవడంతో మంటలు అదుపులోకి రావడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.



జోగికొండపై అలముకొన్న పొగలు

క్షేత్రస్థాయిలో పోలింగ్ సరళిపై చర్చ

- నేతలు, కార్యకర్తలను అడిగి తెలుసుకున్న అచ్చెన్న
- గెలుపునకు ఢోకా లేదని నేతల్లో ధీమా

టెక్కలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్య నేతలు, కార్యకర్తలతో భేటీ అయి క్షేత్రస్థాయిలో పోలింగ్ సరళిపై ఆరా తీశారు. బూత్ లెవెల్‌లో కూటమికి ఏ మేరకు ఓట్లు పడ్డా యి, ఓటర్ల ఆదరణ ఎలా ఉందన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. విజయంపై ఢోకా లేదని, మెజార్టీ లెక్కలు వేసుకుంటున్నామని పలువురు నేతలు అచ్చెన్నాయుడుకు వివరించారు. టెక్కలి మండలం రాధావల్లభాపురంలో ఓ కార్యక్రమానికి హాజరైన అచ్చెన్నాయుడుతో టెక్కలి, నందిగాం మండలాల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి, పినకాన అజయ్ కుమార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికలు జరిగిన తీరుపై విశ్లేషించారు. నాలుగు మండలాల్లో మెజార్టీ ఓట్లు టీడీపీకే పడ్డాయని వారు వివరించారు. పలువురు కార్యకర్తలు అచ్చెన్నకు దుశ్శాలువాలు కప్పి అభినందించారు. కార్యక్రమంలో నేతలు చౌదరి బాబ్జి, కింజ రాపు హరిప్రసాద్, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రాధావల్లభాపురంలో అచ్చెన్నాయుడును సత్కరించిన నాయకులు

'బగ్గు' కార్యాలయానికి కార్యకర్తల తాకిడి

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం టీడీపీ కూటమిలో హుషారు పెరిగింది. దీంతో గ్రామాల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అతిథి గృహానికి బుధవారం తరలివచ్చారు. నాలుగు మండలాల నుంచి గ్రామస్థాయి కేడర్, మండల నాయకులు వచ్చి పోలింగ్ బూత్‌ల వారీగా పోలింగ్ సరళి, కూటమికి మద్దతు తదితర అంశాలపై రమణమూర్తితో చర్చించారు. సారవకోట ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, మెండ రాంబాబు, డోల జగన్, పోలాకి మాజీ ఎంపీపీ తమ్మినేని భూషణరావు తదితర నాయకులు ఆయనను కలిసి పోలింగ్ సరళిని వివరించారు.

మీ శ్రమను మరిచిపోలేను: శిరీష

వజ్రపుకొత్తూరు: ఎన్నికల ప్రచారంలో మీరు పార్టీపై చూపిన అభిమానం, ఆదరణ ఎన్నడూ మరిచిపోలేనని టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. బుధవారం పలాస పార్టీ కార్యాలయంలో డోకులపాడు పంచాయతీకి చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆమెను కలిసి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైసీపీ ఎన్ని ఇబ్బందులు గురిచేసినా ఐదేళ్లు పార్టీని కంచుకోటగా నిలిపి ఐక్యతను చాటడం అభినందనీయమన్నారు. మీరు అందించిన సేవలను పార్టీ గుర్తించుకుంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ, నాయకులు కాస పాపారావు, కొయిరి శ్రీనివాస్, రమేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శిరీషను కలిసిన మాకనపల్లి కార్యకర్తలు

పలాసరూరల్: పలాస టీడీపీ కార్యాలయంలో టీడీపీ అభ్యర్థి గౌతు శిరీషను బుధవారం మాకనపల్లికి చెందిన టీడీపీ కార్యకర్తలు కలిసి ముందస్తు అభినందనలు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఓటింగ్ తీరు, ఇతర అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.



ముఖ్యనేతలతో చర్చిస్తున్న బగ్గు రమణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న గౌతు శిరీష

ఓటమి భయంతోనే వైసీపీ దాడులు

- మాజీ విప్ కూన రవికుమార్



కాకర్ల కుటుంబాన్ని పరామర్శిస్తున్న రవికుమార్

పొందూరు: వైసీపీకి ఓటమి తప్పదని స్పష్టం కావడంతో నిస్పృహలోనే రాష్ట్రంలో వైసీపీ శ్రేణులు దాడులు అల్లర్లకు పాల్పడుతున్నాయని మాజీ విప్, టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు.

రాష్ట్రంలో కూటమి విజయం ఖాయమైందన్నారు. అధికార వైసీపీ ప్రభుత్వంపై కోపంతో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారన్నారు. స్థానిక ఎన్ని కలలో అధికార పార్టీకి తొత్తులుగా మారిన కొంతమంది పోలీసులు అధి కార పార్టీ దౌర్జన్యాలకు సహకరించారని, కాని ఎలక్షన్ కమిషన్ ముందు చూపుతో అధికార పార్టీకి అనుకూల అధికారులను బదిలీ చేయడంతో దౌర్జన్యాలు చేయడానికి అవకాశాలు లేక వైసీపీ నాయకులు నిష్పక్ష పాతంగా విధులు నిర్వహించిన అధికారులు, ఎలక్షన్ కమిషన్‌పై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్ర ప్రజలు ప్రజలు కూటమివైపే ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

పొందూరు మాజీ మేజర్ కాకర్ల పైడిలింగం కుటుంబాన్ని బుధవారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కూన రవికుమార్ పరామర్శించారు. ఈనెల 12న పైడిలింగం మృతిచెందిన విషయం తెలుసుకుని ఆయన కోడలు, వైస్ ఎంపీపీ చెల్లమాంబ, కుమారుడు మాజీ వైస్ ఎంపీపీ కాకర్ల రాజారావులను కలిసి సానుభూతి తెలిపారు. రవి కుమార్‌తో పాటు ఏఎంసీ మాజీ చైర్మన్ అన్నెపు రాము, టీడీపీ పట్టణ అధ్యక్షుడు చినరంగ, వై.కిషోర్, కె.శ్రీనివాసరావు, డి.రవికుమార్ తదితరులు ఉన్నారు.

ఆటో ఎక్కుతూ జారిపడి వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైం: నగరంలో ఓ వ్యక్తి ఆటో ఎక్కుతూ జారిపడి మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక చిన్నమండల వీధికి చెందిన తోట శ్రీనివాసరావు(46) పెయింటింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. సరుబుజ్జిలిలో కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు తన చెల్లెలుతో బయలుదేరాడు. సూర్యమహల్ కూడలిలో ఆటో ఎక్కుతుండగా డ్రైవర్ అజాగ్రత్తగా శ్రీనివాసరావు ఎక్కుతుండగా ఆటో తీసేశాడు. దీంతో పడిపోయిన శ్రీనివాసరావు తల రోడ్డును బలంగా గుద్దుకుంది. వెంటనే శ్రీనివాసరావును జెమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాసరావు మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్‌ఐ ప్రసాదరావు కేసు నమోదు చేశారు.

బైక్‌పై నుంచి పడిన మహిళకు గాయాలు

శ్రీకాకుళం క్రైం: రాజాం మండలం వంజరాంపేట గ్రామానికి చెందిన గోవిందరావు అతని భార్య సత్యవతి, కుమారుడు, కోడలితో కలిసి శ్రీకాకుళంలోని అరసవిల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి వచ్చారు. స్వామి వారిని దర్శించుకుని తిరిగి బైక్‌పై తమ గ్రామానికి వెళ్తుండగా కిమ్స్ సమీపంలోని దత్తాత్రేయ ఆలయం వద్ద సత్యవతి జారిపడిపోయింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమెను భర్త గోవిందరావు కిమ్స్‌లో చేర్పించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ లోని కేజీహెచ్‌కు తరలించారు. దీనిపై ట్రాఫిక్ ఎస్‌ఐ ప్రసాదరావు కేసు నమోదు చేశారు.

శిస్తు కాజేసిన వ్యక్తిపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం: దేవుని భూమి శిస్తు డబ్బులు నకిలీ రశీదులతో రైతుల నుంచి కాజేసిన ఆలయ సిబ్బందిపై కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే... నగరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉమారుద్ర కోటేశ్వర ఆలయంలో ఉన్న ఆంజనేయ స్వామి, కోటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి వాడాడ గ్రామంలో రైతుల ఆధీనంలో భూములకు, సరుబుజ్జిలి మండలం పెద్ద వెంకటాపురం గ్రామానికి చెందిన రైతుల వద్ద ఉన్న భూములకు గాను ఆలయానికి శిస్తు కడుతుంటారు. దీనికి గాను సుమారు రూ.2.20 లక్షల మేర ఆలయ రికార్డుల్లో నమోదు కాలేదు. దీంతో ఆలయ ఈవో సుకన్య విచారించగా.. ఆలయంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వల్లూరి సతీష్ అనే వ్యక్తి రైతుల నుంచి శిస్తు వసూలు చేసి, వారికి దొంగ రశీదులు ఇచ్చి నగదు కాజేసినట్టు గుర్తించారు. ఈ మేరకు ఈవో సుకన్య వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ బలివాడ గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషయంపై ఈవో సుకన్యను వివరణ కోరగా.. సతీష్ ఆలయంలో రశీదు పుస్తకాలను తస్కరించి శిస్తు డబ్బులు కాజేశారన్నారు. అతడ్ని ప్రస్తుతం సస్పెండ్ చేశామని, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఇరువర్గాలపై..

శ్రీకాకుళం క్రైం: చాపురం పంచాయతీలో ఈ నెల 13న ఇరు వర్గాల మధ్య జరిగిన కొట్లాటపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్‌ఐ వాసుదేవరావు బుధవారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైసీపీ, టీడీపీ వర్గాలమధ్య కొట్లాట చోటు చేసుకుంది. దీంతో ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఎన్నికల సమయంలో కొట్లాట జరగడంతో చాపురంలో రెండు రోజులు పోలీసు పికెట్ ఏర్పాటు చేశామన్నారు.

కట్టె జనుము చేను దగ్ధం

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామానికి చెందిన రైతు కిల్లి లక్ష్మీగోవిందరావుకు చెందిన పొలంలో ఉన్న ఐదు ఎకరాల కట్టె జనుము మంగళవారం రాత్రి దగ్ధమైంది. తెలియని వ్యక్తుల పనేనని బాధితుడు ఆరోపిస్తున్నాడు. బుధవారం పొలానికి వెళ్లి చూడగా కట్టె జనుము చేను పూర్తిగా కాలిపోయిందని, చుట్టుపక్కన కూడా ఎటువంటి పంటలు లేకపోవడంతో ఎవరో కావాలనే తమపై కక్షతో ఈ పనిచేసినట్టు రైతు లక్ష్మీగోవిందరావు వాపోయారు.

తగాదాలకు దూరంగా ఉండాలి


పోలీస్ పికెట్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ శృతి

ఆమదాలవలస: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజక వర్గంలోని పలు సమస్యాత్మక గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్‌ను బుధవారం శ్రీకాకుళం డీఎస్పీ వై.శృతి పరిశీలించారు. ఎన్నికలు సందర్భంగా పలు గ్రామాల్లో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య వాగ్వాదాలు, కొట్లాటలకు దారితీసింది. ఈ నేపథ్యం ఆయా గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా ఆమదాలవలస సర్కిల్ పరిధిలో కుద్దిరాం బజే నాయుడు కాలనీ దన్నాన్నపేట, సరుబుజ్జిలి మండలం చిగురువలస గ్రామల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. కుద్దిదారంలో బజే నాయుడు కాలనీలో డీఎస్పీ శృతి పరిశీలించి పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామస్థులతో మాట్లాడారు. ఎన్నికలు వస్తాయి, పోతాయని వాటి కోసం తగాదాలుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. డీఎస్పీ వెంట సీఐ జి.దివాకర్‌యాదవ్, సిబ్బంది ఉన్నారు.

మలేషియా నుంచి వచ్చి ఓటేశారు..


శేషుకుమార్, తేజస్వినిలను అభినందిస్తున్న ఎంపీ రామ్మోహన్

అరసవల్లి: ఓట్ల పండుగ ముగిసింది. ఓటు హక్కును వినియోగించుకునేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చి ఓటేయడం కనిపించింది. కానీ శ్రీకాకుళానికి చెందిన వాండ్రం గి శేషుకుమార్, తేజస్విని దంపతులు మలేషియా నుంచి ఓటు వేయడానికి రావడం గొప్ప విష యం. ఓటుతోనే మన భవిష్యత్తు ముడిపడి ఉందన్న విషయాన్ని వారు రుజువు చేశారు. శ్రీకాకుళానికి చెందిన శేషుకుమార్ మలేసియాలో సైంటిస్టుగా, తేజస్విని డెం టిస్టుగా పనిచేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని మరీ వచ్చారు. ఇంత బాధ్యతగా విదేశాల నుంచి ఓటు హక్కును వినియోగించుకున్న వీరిని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ ప్రత్యేకంగా అభినందించారు.

షిర్డీ సాయికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బలగలో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా 108 కలశాలతో మహిళలు పెద్దన ఎత్తున తిరువీధి నిర్వహించారు. ఈ సందర్భంగా మూల విరాట్‌కి పాలాభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలు, పూలతో అలంకరణ నిర్వహించారు. లలితా విష్ణు సహస్రనామ పారాయణం పటించారు. భక్తులు పూజల్లో పాల్గొన్నారు.


108 కలశాలతో తిరువీధి

మందుబాబులకు అడ్డా

- నడిమివలస విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అసాంఘిక కార్యకలాపాలు
- సేవలు అందకుండానే శిథిలావస్థకు
- పట్టించుకోని అధికారులు


హెల్త్ క్లినిక్ భవనం లోపల దుస్థితి

జి.సిగడాం: నడిమివలస విలేజ్ హెల్త్ క్లినిక్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. గ్రామానికి సుమారు కిలోమీటరన్నర దూరంలో హెల్త్ క్లినిక్ ఉండడంతో మందుబాబుల కార్యకలాపాలకు నెలవుగా మారింది. రాత్రి, పగలు తేడా లేకుండా ఈ భవనాన్ని మందుబాబుల మద్యం దుకాణంలా మార్చేశారు. భవనం తలుపులు, కిటికీల అద్దాలు ధ్వంసం అయ్యాయి. నూతనంగా నిర్మించిన ఈ భవనంలో సిబ్బంది విధులు నిర్వర్తించినా దాఖలాలు కనిపించలేదు. ఈ భవనం ఆలనాపాలనా ప్రజా ప్రతినిధులు గాని, అధికారులు గాని పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాధనం వృథా అయితే పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.



విరిగిపోయిన తలుపులు, పగిలిన కిటికీ అద్దాలు


గదిలో మద్యం సీసాలు ఇలా..

రికార్డు మెజార్టీపై టీడీపీ ఆశలు

- విజయంపై వైసీపీ ధీమా
- ఆమదాలవలస నియోజకవర్గంలో గెలుపోటములపై చర్చ

ఆమదాలవలస: నియోజకవర్గంలో ఈ నెల 13న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గత శాసనసభ్యుల మెజార్టీలన్నింటినీ తుడిచిపెట్టి రికార్డు స్థాయి మెజార్టీ సాధిస్తుందనే అంచనాలు టీడీపీ శ్రేణులు వేస్తూ ఆశల పల్లకిలో ఊరేగుతున్నారు. అలాగే ఈసారి 2019 శాసనసభ ఎన్నికల్లో సాధించిన 13,991 ఓట్ల మెజార్టీ రాకపోయినా కనీస మెజార్టీతోనైనా అసెంబ్లీ స్థానాన్ని దక్కించుకుంటామని ధీమాలో వైసీపీ శ్రేణులు అంచనాలు వేస్తున్నాయి. ఆమదాలవలస నియోజకవర్గం ఏర్పడిన తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటివరకు 2009 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొడ్డేపల్లి సత్యవతి, టీడీపీ అభ్యర్థి తమ్మినేని సీతారాంపై సాధించిన 16,209 మెజార్టీ ఇప్పటివరకు అత్యధికంగా ఉండగా, 1999 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తమ్మినేని సీతారాం, కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డేపల్లి సత్యవతిపై సాధించిన 1,511 ఓట్ల మెజార్టీతో అత్యల్పంగా ఉంది. అయితే 2024 ఎన్నికల్లో నియోజకవర్గంలోని నాలుగు మండలా లతోపాటు ఆమదాలవలస మున్సి పాలిటీ పరిధిలోని ఉన్న 259 పోలింగ్ కేంద్రాల్లో 1,93,858 ఓటర్లు ఉండగా 1,54,225 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అసెంబ్లీ బరిలో ఎన్నడూ లేని విధంగా ఈసారి 13 మంది అభ్యర్థులు పోటీ చేసినా.. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ మధ్య పోటీ రసవత్తరంగా సాగింది. కాంగ్రెస్, బీఎస్పీ వివిధ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా ఎన్నికల్లో నిలిచినప్పటికీ వైసీపీను వీడి స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ వేసిన సువ్వారి గాంధీ ప్రధాన పార్టీలకు గట్టి పోటీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో గాంధీకి కూడా సుమారు పది వేల ఓట్లు లభించే అవకాశం ఉందని ఆయన అనుచరులు కూడా అంచనాలు వేస్తున్నారు. నియోజకవర్గంలోని పొందూరు, ఆమదాలవలస మండలాలతోపాటు మున్సిపాలిటీ పరిధిలో స్వతంత్ర్య అభ్యర్థి గాంధీకి ఓట్లు లభించే అవకాశాలు ఉండడంతో ఈ ప్రభావం వైసీపీ అభ్యర్థికి కొంతమేర నష్టం వాటిల్లే అవకాశం ఉన్నట్టు పలువురు అభిప్రాయపడుతున్నారు. 2019 జరిగిన ఎన్నికల్లో 79.10 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 79.54 శాతం ఓట్లు నమోదు కావడంతో ప్రధాన పార్టీలు అత్యధిక ఓటింగ్ నమోదు వల్ల తమ పార్టీకి లబిస్తుందంటూ ఇరు పార్టీలు ఊహాగానాల్లో ఉన్నారు. 1,57,848 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోగా అందులో మహిళలు 79,330 మంది కాగా పురుషులు 78,515 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 81.42 శాతం నమోదైనట్టు జరిగింది. మరి ప్రధాన పార్టీల అంచనాలు, ఊహాలు జూన్ 4న తెరవనున్న ఈవీఎంల్లో ఎవరి అంచనాలు నిజమో, ఎవరికి విజయం వరిస్తుందో వేచి చూడాలి.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

గార: గార పంచాయతీ ఆరంగిపేట గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన పొలంలో ఇలా విద్యుత్ స్తంభం బాగా వాలిపోయి కనిపిస్తోంది. ఏ మాత్రం గాలి వేసిన ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఈ విషయమై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


వాలిపోయిన విద్యుత్ స్తంభం

అచ్చెన్నాయుడిని కలిసిన గొండు శంకర్


అచ్చెన్నాయుడిని సన్మానిస్తున్న గొండు శంకర్

అరసవల్లి/టెక్కలి: ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గురువారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. నిమ్మాడలోని ఆయన నివాసం కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు పోలింగ్ సరళిని, ప్రాంతాల వారీగా తమకు వచ్చే ఓట్లను గురించి మాట్లాడుకున్నారు. తమ గెలుపు తథ్యమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శంకర్ అచ్చెన్నాయుడికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

మూడంచెల భద్రత పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

గుజరాతీపేట: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను ఎస్పీ జీఆర్ రాధిక బుధవారం పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతను పరిశీలించి పలు సూచనలను చేశారు. కేంద్ర బలగాల గార్డులను, జిల్లా ఆర్మీ, పోలీసు గార్డు, సివిల్ పోలీస్ బందోబస్తును పరిశీలించారు. సీసీ కెమేరాల పర్యవేక్షణపై ఆరా తీశారు. 24 గంటలూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. తనిఖీ అధికారులు నిరంతరం పహారా ఉంటుందన్నారు. ఇతర అంశాలపై ఎస్పీ దిశా నిర్దేశాలు చేశారు.

రామ్మోహన్ హ్యాట్రిక్ తథ్యం

అరసవల్లి: ఎంపీగా కింజరాపు రామ్మోహన్ నాయుడు ముచ్చటగా మూడోసారి హాట్రిక్ సాధించడం తథ్యమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు అన్నారు. గురువారం 80 అడుగుల రోడ్డులో గల ఎంపీ కార్యాలయంలో తన సతీమణి శారదతో కలిసి ఎంపీని కలుసుకున్నారు.

కళాను కలిసిన ఎన్ఈఆర్


కళాతో ఎన్ఈఆర్, టీడీపీ నాయకులు

రణస్థలం: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో తన రాజకీయ గురువు అయిన కిమిడి కళావెంకటరావును ఎచ్చెర్ల నియోజకవర్గం ఎన్డీఏ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు బుధవారం రాజాంలోని కళా క్యాంపు కార్యాలయంలో కొంత సమయం ఆయనతో ముచ్చటించారు. ఎచ్చెర్ల నియోజకవర్గం రాజకీయ పరిస్థితులను వివరించారు. ఈయనతో పాటు ముప్పిడి సరేష్, లంక శ్యామలరావు, పిషిని జగన్నాథంనాయుడు, బెండు మల్లేసు, పిన్నింటి మధు, పైడయ్యరెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డుపైనే మురుగు


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

ఆమదాలవలస: వంజంగి గ్రామంలో వీధి రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తూ డ్రైనేజీని తలపిస్తుంది. దీంతో రాకపోకలకు ప్రజలకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా పున్నయ్యవీధి పరిస్థితి అయితే మరింత దారుణంగా కనిపిస్తుంది. ఇరుకుగా ఉన్న ఈ వీధిలో సీసీ రోడ్డుపై నిత్యమూ మురుగునీరు ప్రవహిస్తూనే ఉంటుంది. రోడ్డుకు ఇరువైపులా క్యాలైన్ పాటించి వెళ్లాల్సివస్తుంది. ఆమదాలవలస జడ్పీటీసీ, మండల సీనియర్ వైసీపీ నాయకులు బెండి గోవిందరావు స్వగ్రామమైన ఈ గ్రామంలో పున్నయ్యవీధి రహదారితో పాటు మరో నాలుగు రహదారులు కూడా ఇదే విధంగా రోడ్డు మధ్యలో నీరు ప్రవహిస్తూ పలువురికి ఆశ్చర్యానికి గురిచేస్తుంది. గ్రామ సచివాలయాల వ్యవస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాలన్నీ సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించామని ప్రకటనలే పరిమితమని పలువురు విమర్శిస్తున్నారు.

తాగునీరు అందించండి

ఆమదాలవలస: ప్రజల గొంతు ఎండుతోంది తాగునీరు అందించాలని శ్రీనివాసాచార్యులపేట సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీపీ తమ్మినేని శారద అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గౌరీపతి మాట్లాడుతూ.. శ్రీనివాసాచార్యులపేట గ్రామంలో 450 ఇళ్లకు తాగు నీటి కొళాయి కనెక్షన్లు ఇచ్చి సక్రమంగా తాగునీరు అందించడం లేదని, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. సమస్య పరిష్కారం కావాలంటే పెద్ద బోరను ఏర్పాటు చేసి ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించి నీరు అందించాలని కోరారు. దీనిపై ఎంపీడీవో వాసుదేవరావు మాట్లాడుతూ.. ఈ సమస్యను తొందరలోనే పరిష్కరిస్తామన్నారు. అక్కులపేట ఎంపీటీసీ బొడ్డేపల్లి సుగుణ మాట్లాడుతూ.. అక్కులపేట నుంచి బొబ్బిలిపేటకు వెళ్లే బీటీ రహదారిని నిర్మిస్తున్నారని, అయితే అక్కులపేట చివరి వరకు సీసీ రహదారి ఉందని, అక్కడ నుంచి నిర్మిస్తున్న బీటీ రోడ్డు లోతుగా ఉండడం వల్ల ఈ మధ్య వర్షం పడినప్పుడు నీరు చేరి చెరువులా మారిందన్నారు. వంజంగిపేట గ్రామ సర్పంచ్ పైడి లక్ష్మి తమ గ్రామంలో కూడా తాగునీటి సమస్య ఉందన్నారు. తొందరలోనే సమస్యలనపు పరిష్కరిస్తామని ఎంపీపీ తమ్మినేని శారద తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, వైస్ ఎంపీపీ సోమరాజు జగన్నాథం, మండల అధికారులు పాల్గొన్నారు.

రైల్వే అండర్‌పాసేజ్‌లో నీటితో ఇబ్బందులు


కొత్తగ్రహారం రైల్వే అండర్ పాసేజ్‌లో నిలిచిన నీరు

నందిగాం: కవిటి అగ్రహారం గ్రామస్థుల రాకపోకల కోసం ఏర్పాటు చేసిన రైల్వే అండర్ పాసేజ్ మార్గంలో వర్షపు నీరు చేరి రోజుల తరబడి నిలిచిపోతోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం గ్రామస్థులతో పాటు పలాస, పూండి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రోజుల తరబడి నీరు నిలిచిపోతుండడంతో ఇక్కట్లకు గురవుతు న్నామని వారు వాపోతున్నారు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ కష్టాలు తీరేనా?

- తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు
- నిత్యం వాహనదారులకు కష్టాలు
- ఇదీ పట్టణంలోని ప్రధానమార్గం తీరు
- రోడ్డు విస్తరణ లేక ఇక్కట్లు


ట్రాఫిక్ అవస్థలు (ఫైల్)


విస్తరించాల్సిన రోడ్డు ఇదే (ఫైల్)

సోంపేట: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రముఖ పట్టణంగా సోంపేటకు గుర్తింపు ఉంది. ఉద్దానం ముఖ కేంద్రంగా విలసిల్లుతున్న పట్టణంలో ట్రాఫిక్ సమస్య నిత్యం వెన్నాడుతూనే ఉంది. ప్రధాన మార్గంలో తరచూ భారీ వాహనాలతో ట్రాఫిక్ నిలిచిపోయి ద్విచక్ర వాహన దారులు, కార్లు, ఇతర వాహనాల్లో ప్రయాణించే ప్రయా ణికులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. దశా బ్దాలుగా ఈ సమస్య ఉన్నా ప్రధానమార్గం విస్తరణకు నోచుకోక పోవడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు నిత్యం ఇక్కట్లకు గురవుతున్నారు. పట్టణంలోని తిరు మల థియేటర్ నుంచి జామి ఎల్లమ్మ గుడి వరకు ఉన్న మార్గంలో ఒక వైపు నుంచి బస్సు వస్తే రెండో వైపు బస్సు తప్పించుకునే పరిస్థితి లేదు. కిలో మీటర్ దూరం ఉండే ఈ ప్రధాన మార్గం దాటాలంటే ఒక్కోసారి అర గంటకు పైగా సమయం పడుతోందని పలువురు వాహ నదారులు పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో ముఖ్యమైన వాణిజ్య కేంద్రంగా ఎదగాల్సిన సోంపేట పట్టణం లో మెయిన్ రోడ్డు విస్తరణ లేకపోవడంతో పంచాయతీ అభివృద్ధి లేక ఉండి పోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. రోడ్డు విస్తరణ చేపట్టాలని పలువురు స్థానికులు ప్రజాప్రతినిధులను కోరినా స్పందించిన దాఖలాలు లేవు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరు వాత కంచిలి జాతీయ రహదారి నుంచి సోంపేట పట్టణం మీదుగా కొర్లాం హైవే వరకు రహదారి విస్తరణ చేస్తామన్న హామీ గాలిలో కలిసిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందిం చి విస్తరణ ఆవశ్యకతను గుర్తించి తగుచర్యలు తీసుకో వాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.